సాక్షి
నిజామాబాద్
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



రికార్డు బ్రేక్ అయ్యేనా..!

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ జల విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 27 మిలియన్ యూనిట్లు కరెంట్ ఉత్పత్తి చేస్తే రికార్డు బ్రేక్ కానుంది.

- 8లో ▸



ముగిసిన ఎస్‌పీఎల్

నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.4 /20.8

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. చలి తీవ్రత కొనసాగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

మల్లారం అడవుల్లో నీల్‌గాయ్



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాల్లో నీల్ గాయ్‌లు సంచరిస్తున్నా యి. ఇవి చాలా భయస్తులు కావడంతో సాధారణంగా ఇవి ఎవరికీ కనిపించకుండా దట్టమైన అడవుల్లో నే నివాసం ఉంటాయి. అయితే, రెండు రో జుల క్రితం నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం ఫారెస్టులో ఒక ఆడ నీల్‌గాయ్ ద ర్శనమిచ్చింది. ఫారెస్టు అధికారులు అడవి లో ట్రాకింగ్ చేయడానికి వెళ్లిన సమయంలో తన పిల్లలకు పాలిస్తూ కనిపించింది. అధికా రులు వెంటనే తన ఫోన్‌లో ఫొటో తీశారు. మల్లారంతో పాటుగా సిరికొండ, ఇందల్వాయి, వర్ని, కమ్మర్‌పల్లి, నందిపేట్ ఫారె స్టుల్లో ఎక్కువగా సంచరిస్తున్నట్లు అటవీ అ ధికారులు పేర్కొంటున్నారు. పులులు ఎక్కువగా నీల్‌గాయ్‌లనే వేటాడతాయని, వీటి సంచారం ఎక్కువగా ఉన్న చోట పులులు తప్పకుండా ఉంటాయంటున్నారు. కాగా జిల్లాలో నీల్‌గాయ్‌లు వందల సంఖ్యలో ఉన్నాయని చెబుతున్నారు.

సీనియారిటీ జాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి సినియారిటీ జాబితాను మంగళవారం విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్ల విభాగంలో కేటగిరీల వారీగా జాబితా రూపొందించారు. ఇందులో లోకల్ బాడి విభాగంలో అందరు స్కూల్ అసిస్టెంట్లకు వారి నియామక తేదీ 2002 అక్టోబర్ 17 నుంచి, ఎస్సీ కేటగిరిలో 2005 నంబర్ 22 నుంచి, ఎస్టీ విభాగంలో 2007 నంబర్ 21 నుంచి, వికలాంగుల విభాగంలో మెడికల్ ధ్రువపత్రాలు పరిశీలించి బదిలీ చేస్తామని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ విభాగంలో..

ప్రభుత్వ విభాగంలోని అందరు స్కూల్ అసిస్టెంట్లకు 2001 డిసెంబర్ 20నుంచి, ఎస్సీ విభాగంలో 2003 జూన్ 26 నుంచి, ఎస్టీ కేటగిరిలో 2009 జనవరి 30 నుంచి, వికలాంగుల విభాగంలో మెడికల్ ధ్రువపత్రాలు పరిశీలించి బదిలీ చేస్తారు. వీరందరూ నేడు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్వీస్‌బుక్, సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు.

సీసీఎస్ ఏసీపీ రమేశ్ బదిలీ

ఖలీల్‌వాడి: జిల్లా సీసీఎస్ ఏసీపీగా పనిచేసిన రమేశ్ బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఇంటలిజెన్స్ విభాగానికి వెళ్తున్నారు. ఈయన స్థానంలో సీసీఎస్‌కు ఎవరూ రాలేదు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటికే రెండు డీసీపీ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అరవింద్ బాబు ఇటీవల కరీంనగర్ పీటీసీకి బదిలీ అయిన విషయం తెలిసిందే.

మహారాష్ట్రలోని కిన్వట్‌లో జెడ్పీ చైర్మన్ పర్యటన

- 5న నాందేడ్‌లో బీఆర్ఎస్ సభ విజయవంతం చేయాలని పిలుపు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ నెల 5న కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం విఠల్‌రావు మహారాష్ట్రలోని కిన్వట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కాంగ్రెస్, బీజేపీ, ఎన్‌సీపీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం విఠల్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహారాష్ట్రలోనూ అమలు చేయాలంటే బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు.

ఖేలో ఇండియా టోర్నీ ప్రారంభంలో నిఖత్



నిజామాబాద్‌నాగారం : మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ క్రీడల ప్రారంభానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ బాక్సర్, అర్జున అవార్డు గ్రహీత నిఖత్ జరీన్ వెళ్లారు. టోర్నీ సోమవారం రాత్రి ప్రారంభమైంది. ఫిబ్రవరి 15వరకు పోటీలు జరగనున్నాయి.

పని తీరు సంతృప్తినిచ్చింది

- అందరి సహకారంతో కోవిడ్‌ను ఎదుర్కొన్నాం..
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా
- కేంద్రం నుంచి నాలుగు ఉత్తమ గ్రామపంచాయతీల అవార్డులు
- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి బదిలీ
- 'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కోవిడ్ లాక్‌డౌన్, కోవిడ్ బాధితులకు వైద్య సేవలు అందించడంలో కలెక్టర్ నారాయణరెడ్డి తనదైన పనితీరుతో ప్రత్యేకతను చాటుకున్నారు. బదిలీ నేపథ్యంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. మహారాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో కోవిడ్ వేరియంట్ ప్రభావం జిల్లాపై తీవ్రంగా పడినప్పటికీ ప్రభుత్వ సూచనల మేరకు సమర్థంగా ఎదుర్కొన్నాం. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత నిజామాబాద్ జిల్లాలో కోవిడ్ సమస్య ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలందరి, అధికారులు, ఉద్యోగుల సహకారంతో పకడ్బందీగా అధిగమించాం. ఇది అచీవ్‌మెంట్. అదేవిధంగా పల్లెప్రగతి, కంపోస్ట్ షెడ్లు, ప్రకృతి వనాల ఏర్పాటు విషయంలో లక్ష్యం సాధించాం. మరోవైపు ధరణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి పెట్టి 26 వేల దరఖాస్తుల్లో 24వేల దరఖాస్తులను డిస్పోజ్ చేశాం. ఇక ఎవెన్యూ ప్లాంటేషన్ విషయంలోనూ అనుకున్నవిధంగా ముందుకెళ్లాం. ఉపాధిహామీ పనిదినాలు పెంచడంతో పాటు మెటీరియల్ కాంపొనెంట్ అనుకున్నవిధంగా సాధించాం. ఉత్త మ గ్రామ పంచాయతీలకు సంబంధించి కేంద్రం ఇచ్చిన అవార్డుల్లో దేశంలో టాప్ టెన్ గ్రామాల్లో 9 తెలంగాణ నుంచి ఉండగా, అందులో 4 గ్రామాలు నిజామాబాద్ జిల్లా నుంచి ఉండడం సంతోషంగా ఉంది. స్వచ్ఛ సర్వేక్షణ్ విషయంలో నిజామాబాద్ జిల్లా దేశంలో మూడో స్థానంలో నిలవడం సంతృప్తినిచ్చింది.

కొత్త కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హనుమంతు



జిల్లాకు కొత్త కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హన్మంతు వస్తున్నారు. ప్రస్తుతం ఆయన హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణరెడ్డి 2019 డిసెంబర్ 24న నిజామాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. రాజీవ్‌గాంధీ హనుమంతు 'సాక్షి'తో మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో నిజామాబాద్‌లో బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు.

ప్రొఫైల్..

- రాజీవ్‌గాంధీ హనుమంతు
- పుట్టిన తేదీ 16.06.1987
- బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఆంధ్రా యూనివర్శిటీ
- ఐఏఎస్ 2012 బ్యాచ్, తెలంగాణ క్యాడర్
- శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు..



- ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ పడేనా?
- 2016–17లో కేంద్ర క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద మంజూరు
- రాష్ట్రం నుంచి 50 శాతం నిధులిచ్చే ఒప్పందం కాకపోవడంతో నిలిచిన ప్రక్రియ
- బీజేపీ ఎంపీల ప్రాతినిధ్యం నేపథ్యంలో మంజూరుకు అవకాశాలు
- ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌ల ప్రోత్సాహంపై యువ రైతుల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పార్లమెంట్‌లో బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు నిధుల కేటాయింపు విషయమై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణలోనే వ్యవసాయపరంగా ముందంజలో ఉన్న జిల్లా కావడంతో సాగు విషయంలో మరింత సాంకేతికతను ప్రోత్సహించేందుకు రైతులకు ఏ మేరకు పథకాలు కల్పిస్తారనే విషయమై యువరైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తారా అనే విషయమై ఎదురు చూస్తున్నారు.

ఇక జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు నిర్మల్, బోథ్ నియోజకవర్గాల మీదుగా నేరుగా ఆదిలాబాద్‌కు రైల్వేలైన్ కనెక్టివిటీ కోసం నిధుల మంజూరు విషయమై అన్నివర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. 2016–17 కేంద్ర బడ్జెట్‌లో ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వే లైన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇందుకు సంబంధించి 136 కిలోమీటర్ల లైన్‌కు రూ. 2,720 కోట్లు అంచనాతో ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున నిధులను భరించేలా నిర్ణయించారు. ఈ క్రమంలో కేంద్రం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద మంజూరు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 50 శాతం వాటా రూ. 1,360 కోట్లు ఇచ్చే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదరకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అయితే త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. అదేవిధంగా ఆదిలాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాలకు బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నందున కేంద్రమే వంద శాతం నిధులు భరించేలా మంజూరు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఇతర డిమాండ్లు..

- ప్రస్తుతం విశాఖపట్నం నుంచి సాయినగర్ షిర్డీ మధ్య నడుస్తున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కాజీపేట–సికింద్రాబాద్–నిజామాబాద్ మార్గం బదులుగా, దగ్గరి మార్గమైన కాజీపేట–పెద్దపల్లి–నిజామాబాద్ మీదుగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- నిజామాబాద్–పెద్దపల్లి మార్గంలో డబ్లింగ్ పనులకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.
- ముంబై–కరీంనగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతిరోజూ నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

"ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలి



జిల్లాలో రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరించాలి. పసుపు, సోయా, మొక్కజొన్న పంటలతో పాటు సీడ్ పంటలను విస్తారంగా పండిస్తున్నందున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలి. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసి బడ్జెట్‌లో జిల్లాకు నిధులను కేటాయించాలి.

– కానూరి సంజీవ్, యువరైతు, మోతె

నందిపేట ఉపసర్పంచ్‌కు నోటీసులు

- సర్పంచ్ దంపతుల ఆత్మహత్యాయత్నం ఘటనపై కలెక్టర్ సీరియస్
- కలెక్టర్, డీపీవోతో పలువురు సర్పంచుల సమావేశం



డీపీవోతో సమావేశమైన సర్పంచులు

సుభాష్‌నగర్: ఎంబీ రికార్డులు పూర్తయి, అధికారుల పరిశీలన చేపట్టిన రూ. 21లక్షలకు సంబంధించిన బిల్లులపై సంతకాలు చేయకుండా కాలయాపన చేస్తున్న నందిపేట ఉపసర్పంచ్ మాద రవికి జిల్లా పంచాయతీ అధికారులు మంగళవారం నోటీసులు జారీచేశారు. పనులు చేపట్టిన బిల్లులకు సంబంధించి చెక్కులపై సంతకాలు పెట్టడం లేదని, గ్రామాభివృద్ధికి సహకరించడం లేదంటూ నందిపేట సర్పంచ్ సాంబారు వాణి దంపతులు సోమవారం కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో మంగళవారం నందిపేట మండలానికి చెందిన పలు గ్రామాల సర్పంచులు కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధతో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని సర్పంచులు విజ్ఞప్తిచేశారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, చాలా గ్రామాల్లో ఉపసర్పంచులు చెక్కులపై సంతకాలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. పెండింగ్ బిల్లుల విషయమై ఉపసర్పంచులు ఇబ్బందులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని కలెక్టర్ సర్పంచులకు సూచించారు. కాగా నందిపేట సర్పంచ్ వాణి దంపతుల ఆత్మహత్యాయత్నం ఘటనపై కలెక్టర్ నారాయణరెడ్డి సీరియస్ అయినట్లు తెలిసింది. అధికారులను కలిసిన వారిలో నందిపేట్, మాయాపూర్, అన్నారం, సీహెచ్ కొండూర్ సర్పంచులు, వార్డుసభ్యులు ఉన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

- అయోధ్య సాధువులకు సన్మానం
- భక్తులతో కిటకిటలాడిన పలుగుట్ట
- కొనసాగుతున్న సాధు పరిషత్ మహాసభలు



సాధువును సన్మానిస్తున్న మంగిరాములు

నందిపేట్(ఆర్మూర్): అందరూ కలిసి హిందూ ధర్మాన్ని పరిరక్షించడమే సాధు పరిషత్ లక్ష్యమని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాతా పరవిద్యానందగిరి అన్నారు. నందిపేటలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సుప్రభాతం, భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా మాతా పరవిద్యానందగిరి ప్రసంగిస్తూ ప్రజలను ధర్మ మార్గాన నడిపించాలనేదే సభల లక్ష్యమన్నారు. పరమ పునీతమైన నందిపేట పలుగుట్ట ప్రాంతంలో మంగిరాములు మహారాజ్ నిర్వహిస్తున్న కార్యక్రమం అద్భుతమన్నారు. అలాగే దేశం నలుమూలల నుంచి వచ్చిన సాధువులు, పీఠాధిపతులు ప్రవచనాలు బోధించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో యాగం నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన 25 మంది సాధువులకు పాదపూజ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైవభక్తితో మంచి మార్గంలో నడవాలని సూచించారు. అయోధ్య నుంచి వచ్చిన సాధువులు ఆవు ఉత్పత్తులతో హోమం చేశారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్మన్ ఆకుల లలిత పాల్గొని సాధువుల ఆశీస్సులు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులకు అల్పాహారం, భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



సాధువులకు నమస్కరిస్తున్న ఆకుల లలిత

'పోడు' ప్రక్రియ పూర్తిచేయాలి

- జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పాల్గొన్న అధికారులు

సుభాష్‌నగర్: పోడు భూములకు సంబంధించిన ప్రక్రియ వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. అర్హులైన వారికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను అందించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసుకోవాలని సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్‌లో ఆర్‌వోఎఫ్‌ఆర్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పోడుభూములకు సంబంధించి వచ్చిన క్లెయిమ్‌లు, క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలన వివరాలు, గ్రామసభల తీర్మానాలు, తదితర అంశాలపై సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటికే వందశాతం గ్రామసభలు పూర్తయ్యాయని, టైం లైన్ మ్యాప్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన వివరాలు క్లెయిమ్‌లతో జతపర్చామని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇంకా ఏమైనా క్లెయిమ్‌లు డివిజన్‌స్థాయిలో పెండింగ్‌లో ఉంటే, తక్షణమే వాటిని జిల్లాస్థాయి కమిటీ పరిశీలన నిమిత్తం పంపించాలని కలెక్టర్ ఆర్డీవోలను ఆదేశించారు. తిరస్కరించిన క్లెయిమ్‌లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి అర్హత కలిగి ఉన్న వారికి తప్పనిసరి న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎఫ్‌వో వికాస్ మీనా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగూరావు, ఆర్డీవోలు రాజేశ్వర్, శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాల నిర్వహణ భేష్

సుభాష్‌నగర్: కంటి వెలుగును జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఇప్పటివరకు ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నారని, కంటి వెలుగు శిబిరాలు ముగిసే వరకు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంటి వెలుగు, ఉపాధిహామీ, హరితహారం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కంటివెలుగు–2 కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 57,640 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 14,992 మందికి రీడింగ్ గ్లాసెస్ అందించామని తెలిపారు. మరో 9,589 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమున్నట్లు గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో పంపించామని వివరించారు. ఉపాధి హామీ పనులు విరివిగా గుర్తిస్తూ కూలీల ప్రాతినిధ్యం పెరిగేలా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అదేవిధంగా అన్నిచోట్ల తెలంగాణ క్రీడా ప్రాంగణాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటుచేయించాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న ట్రైకార్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో ఎంపిక చేసి, సంబంధిత బ్యాంకర్ల వద్దకు పంపించాలని కలెక్టర్ సూచించారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, మెప్మా పీడీ రాములు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం, డీపీవో జయసుధ పాల్గొన్నారు.

పరీక్షలో నెగ్గితేనే..

- మత్స్యకారులకు సంఘాల్లో సభ్యత్వం
- కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాలు
- జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- చెరువుల వద్దే వృత్తి నైపుణ్య పరీక్షల నిర్వహణ
- జిల్లాలో 1,654 మందికి అవకాశం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): మత్స్యకారుడిగా గుర్తింపు పొందాలన్నా, ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలన్నా మత్స్యకారులకు సభ్యత్వం తప్పనిసరి చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందుకు కొత్త సభ్యత్వ నమోదు, సంఘాల ఏర్పాటు ప్రక్రియను చేపట్టింది. మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించి నాలుగు నెలల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఏప్రిల్ 5 వరకు గడువు విధించింది. దీంతో జిల్లా మత్స్యశాఖ అధికారులు ఇటీవల జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ ప్రారంభించారు. అయితే చెరువుల్లో నీటివనరుల విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో 1,654మందికి కొత్తగా సభ్యత్వ నమోదు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కొత్త సభ్యత్వాల జారీలో శాశ్వత నీటి వనరులున్న జలాశయాల్లోని ఎకరం విస్తీర్ణంలో ఒక మత్స్యకారుడికి, వర్షాధారంతో 6–8 నెలలు పాటు నీరుండే జలాశయాల్లో రెండెకరాల విస్తీర్ణంలో ఒక మత్స్యకారుడికి అవకాశం కల్పించనున్నారు.

జిల్లాలో 1,013 చెరువులుండగా, ఇప్పటికే 339 మత్స్య సహకార సంఘాలున్నాయి. ఇందులో 21వేలకు పైగా సభ్యులున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే సంఘాలతో జిల్లాలో మత్స్య సహకార సంఘాల సంఖ్య పెరగనుంది. అయితే, గతంలో ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం మత్స్యకారులుగా 30 కుటుంబాలకు చెందిన వారుండేవారు. ఇటీవల కొత్తగా జారీచేసిన జీవో నం. 4 ప్రకారం మరో మూడు కుటుంబాలను చేర్చడంతో కుటుంబాల సంఖ్య 33కు చేరుకుంది. ఇప్పుడు బెస్త, గూండ్ల, గంగపుత్ర, బోయి, ముదిరాజ్, తెనుగు, తదితర కులాలతో పాటు గిరిజనులకు కూడా కొత్త సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు.

ఈత కొట్టాలి.. తెప్పపై తిరగాలి

మత్స్యకారులు సభ్యత్వ నమోదు చేసుకోవాలంటే అధికారులు నిర్వహించే పరీక్షల్లో నెగ్గాలి. జిల్లాలోని జలాశయాలు, చెరువుల వద్దే మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. శాశ్వత నీటి వనరులున్న జలాశయాల పరిధిలోనైతే ఈత కొట్టడం రావడంతో పాటు తెప్పనుంచి వల విసరడం, కచ్చువల వేసే నైపుణ్యం కలిగుండాలి. ఇక వర్షాధార జలశయాల్లోనైతే ఈత కొట్టడం, విసురు వల వేయడం, పాండ్రి వల లాగడం, వల అల్లడం, ఇతర పరీక్షలుంటాయి. మత్స్యశాఖ అధికారుల సమక్షంలోనే చేయాల్సి ఉంటుంది. పరీక్షల్లో నెగ్గితేనే సభ్యత్వం ఇవ్వనున్నారు. అర్హత సాధించిన వారి వివరాలను జిల్లా ఆఫీసు నుంచి రాష్ట్ర కమిషనర్ ఆఫీసుకు వెళ్తాయి. అక్కడి నుంచి అనుమతి రాగానే సభ్యత్వ పత్రాలు అందజేస్తారు.



చెరువులో వల వేస్తున్న మత్స్యకారుడు (ఫైల్)

సభ్యత్వ నమోదుకు అవకాశం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో 1,600 మందికి పైగా మత్స్యకారులకు నూతన సభ్యత్వ నమోదుకు అవకాశం ఉండనుంది. వీరికి చెరువులు, జలాశయాల వద్దే అధికారుల సమక్షంలో నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తాం. పరీక్షల్లో నెగ్గిన వారికి సభ్యత్వాలు అందజేస్తాం.

– రాజనర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, నిజామాబాద్

క్లుప్తంగా

నాటు తుపాకులు అప్పగించాలి

సిరికొండ: గ్రామాల్లో, తండాల్లో ఎవరి వద్దనైన నాటు తుపాకులు ఉంటే పోలీసులకు స్వాధీనం చేయాలని ధర్పల్లి సీఐ సైదా కోరారు. మంగళవారం ఆయన సిరికొండ పోలీస్‌ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. తుపాకులు స్వాధీనం చేసిన వారిపై ఎలాంటి కేసులు పెట్టమన్నారు. జంతువులను వేటాడటానికి నాటు తుపాకులను వినియోగిస్తున్నారని, అవి మిస్‌ యూజ్‌ అయితే వారి జీవితాలు కటకటాల పాలవుతాయని హెచ్చరించారు. నాటు తుపాకులతో దొరికితే జైలు పాలు కావాల్సి వస్తుందన్నారు. తమ తనిఖీల్లో దొరికినా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌ పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: ఆల్‌ ఇండియా సివిల్‌ సర్వీసెస్‌ బ్యాడ్మింటన్‌ జాతీయ స్థాయి పోటీలకు డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌ (రాజారాంనగర్‌) జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టి.మహేష్‌కుమార్‌ ఎంపికయ్యారు. గుజరాత్‌ రాష్ట్రం గాంధీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొంటారని జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్‌ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్‌ పూల్‌ బుధవారం నుంచి ప్రారంభం అవుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పిల్లలు, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు బ్యాచ్‌లు ఉంటాయన్నారు. మహిళల బ్యాచ్‌ మార్చి 1 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. వివరాలకు స్విమ్మింగ్‌ కోచ్‌ మహిపాల్‌రెడ్డి 9966970010 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ)ల్లో ఇంటర్‌ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ఫిబ్రవరి 4 వరకు పొడిగించినట్లు సంస్థ నిజామాబాద్‌ జిల్లా కోఆర్డినేటర్‌ (డీసీవో) బి.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in వెబ్‌సైట్‌ ద్వారా రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఎస్‌పీఎల్‌..

- పట్టుదలతో ఆడితే విజయం సొంతం : ఏసీపీ వెంకటేశ్వర్‌
- విజేతలకు బహుమతుల ప్రదానం



సీనియర్‌ విభాగంలో రన్నర్‌గా నిలిచిన గౌతమి డిగ్రీ కళాశాల



సీనియర్‌ విభాగంలో విన్నర్‌గా ట్రోఫీ అందుకుంటున్న నిశిత డిగ్రీ కళాశాల జట్టు

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

నిజామాబాద్‌నాగారం: కృషి, పట్టుదలతో ఆడితే క్రీడల్లో విజయం సాధించవచ్చని నిజామాబాద్‌ నగర ఏసీపీ వెంకటేశ్వర్‌ అన్నారు. ఈ నెల 27 నుంచి నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో జరిగిన సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నీ మంగళవారం అట్టహాసంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. సాక్షి క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా క్రికెట్‌ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత నచ్చిన క్రీడల్లో సాధన చేస్తు టోర్నీల్లో పాల్గొని సత్తా చాటాలని సూచించారు. అనంతరం విజేతలు, రన్నర్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రికెట్‌ అసోసియేషన్‌ సభ్యులు, కోచ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్‌ మేనేజర్‌ పల్లె మహేష్‌, బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్‌ ఇన్‌చార్జి ప్రభాకర్‌, ఏడీవీటీ మేనేజర్‌ సంపత్‌, సర్క్యులేషన్‌ మేనేజర్‌ మల్లికార్జున్‌యాదవ్‌, మూడో టౌన్‌ ఎస్సై శ్రావణ్‌కుమార్‌, కోచ్‌ పారస్‌, స్కోరర్‌ యూనిస్‌, అంపైర్లు షారుక్‌, దుర్గాప్రసాద్‌, గ్రౌండ్‌మన్‌ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు జరిగాయి ఇలా..

టోర్నీలో భాగంగా మంగళవారం మొదట సెమీ ఫైనల్‌ మ్యాచ్‌లు జరిగాయి. క్షత్రియ కాలేజీ, నిశిత డిగ్రీ కళాశాల మధ్య పోటీ జరిగిన సెమీస్‌లో నిశిత జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీస్‌లో గౌతమి డిగ్రీ కళాశాల, సాందీపని కళాశాల జట్లు తలపడ్డాయి. గౌతమి కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సాందీపని జట్టు నిర్ణిత ఓవర్లలో 82 పరుగులు చేసింది. హోరాహోరీగా జరిగిన పోరులో ఒక్క పరుగు తేడాతో గౌతమి కళాశాల జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది.



జూనియర్‌ విజేత పాలిటెక్నిక్‌ కళాశాల

జూనియర్‌ విభాగంలో జరిగిన ఫైనల్‌ మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌ కళాశాల, నిజామాబాద్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల మధ్య పోటీ జరిగింది. పాలిటెక్నిక్‌ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌ కళాశాల 80 పరుగులే చేసింది.

సీనియర్‌ విజేత నిశిత కళాశాల

సీనియర్‌ ఫైనల్‌ నిశిత డిగ్రీ కళాశాల, గౌతమి కళాశాల మధ్య జరిగింది. టాస్‌ గెలిచి నిశిత జట్టు 10 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇందులో వైభవ్‌ 60 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గౌతమి కళాశాల జట్టు నిరిత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది.

SPL SAKSHI PREMIER LEAGUE

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional sponsor





ట్రోఫీ అందుకుంటున్న జూనియర్‌ విన్నర్‌ నిజామాబాద్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల జట్టు, రన్నర్‌ ఎస్‌ఆర్‌ జూనియర్‌ కాలేజీ జట్టు

విద్యుదుత్పత్తి రికార్డు బ్రేక్‌ అయ్యేనా

- ఎస్సారెస్పీలో ఇప్పటి వరకు 120 మిలియన్‌ యూనిట్ల ఉత్పత్తి
- రికార్డుకు 27 మిలియన్‌ యూనిట్ల దూరంలో..

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ వద్ద గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 27 మిలియన్‌ యూనిట్ల కరెంట్‌ ఉత్పత్తి చేస్తే రికార్డ్‌ బ్రేక్‌ కానుంది. జల విద్యుత్‌ కేంద్రం చరిత్రలో 1990–91 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 146.4 మిలలియన్‌ యూనిట్ల విద్యుత్‌ ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత సంవత్సరం ఆ రికార్డు బ్రేక్‌ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 120 మిలియన్‌ యూనిట్ల కరెంట్‌ తయారు చేశారు. ఇంకా ఉత్పత్తి కొనసాగుతోంది. జల విద్యుత్‌ కేంద్రంలో విద్యుదుత్పత్తి 1987లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 146.4 మిలియన్‌ యూనిట్ల రికార్డుగా నమోదైంది. కానీ ఆ సమయంలో కేంద్రంలో మూడు టర్బయిన్‌లో మాత్రమే అందుబాటులో ఉండేవి. 2010 నుంచి నాలుగో టర్బయిన్‌ అందుబాటులోకి వచ్చింది. అదనంగా మరో 9 మెగావాట్ల విద్యుదుత్పత్తి అయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 60 రోజుల గడువు ఉంది. రికార్డు బ్రేక్‌ కావడానికి మరో 27 మిలియన్‌ యూనిట్ల దూరం ఉంది. ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌లో కాకతీయ కాలువ ద్వారా నిరంతరం నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ నీటి విడుదల ఆధారంగానే విద్యుత్‌ ఉత్పత్తి జరుగుతుంది. 60 రోజుల్లో 27 మిలియన్‌ యూనిట్ల కరెంట్‌ తయారు చేస్తే కొత్త రికార్డు ఏర్పడుతుంది. 1989–90లో 125.45 మిలియన్‌ యూనిట్లు, 1998–99లో 137.95మిలియన్‌ యూనిట్ల విద్యుత్‌ ఉత్పత్తి చేపట్టారు. తరువాత ప్రస్తుత సంవత్సరమే 120 యూనిట్లు ఉత్పత్తి అయింది.



విద్యుదుత్పత్తి చేసే టర్బయిన్‌లు

సమ్మె నోటీసు అందజేత

తెయూ(డిచ్‌పల్లి): అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్ల సాధన కోసం ఫిబ్ర వరి 15 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ విద్యావర్ధినికి సమ్మె నోటీసు అందజేశారు.

జాతీయ రహదారులపై ఠాణాల ఏర్పాటు

- సీపీ నాగరాజు

ఆర్మూర్‌: రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా జాతీయ రహదారులపై పోలీస్‌ స్టేషన్లు నిర్మిస్తున్నామని నిజామాబాద్‌ సీపీ నాగరాజు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు బాధితులను ఏవిధంగా కాపాడాలనే అంశంపై రోడ్‌ సేఫ్టీ విభాగం అధికారులు పట్టణంలోని సప్తగిరి ఫంక్షన్‌ హాల్‌లో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడారు. 2022లో రోడ్డు ప్రమాదాల్లో జిల్లా వ్యాప్తంగా 320 మంది చనిపోయారని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆర్మూర్‌ ఏసీపీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ వాహనదారుల చిన్న నిర్లక్ష్యం కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్‌ సేఫ్టీ డీఎస్‌పీ చంద్రభాను, డాక్టర్‌ సుమన్‌, డాక్టర్‌ మధుసూదన్‌, ఎంవీఐ వెంకట్‌ స్వామి, ఆర్మూర్‌ పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ నాగరాజు

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్లు

నిజామాబాద్‌ సిటీ: ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌)లో వైద్యులు మూడు అరుదైన ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. దీనికి సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌ మంగళవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవీపేట్‌కు చెందిన సరస్వతి కడుపునొప్పితో ఆస్పత్రికి రాగా ఆమెను పరీక్షించిన వైద్యులు అండాశయంలో 30 సెంటిమీటర్ల కణితి ఉన్నట్లు గుర్తించారు. ఈ కణితి పెద్ద సైజ్‌లో ఉండటంతో మూత్రపిండాలపై ఒత్తిడి పడి ఆమె తీవ్రంగా ఇబ్బంది పడింది. ఈ ఆపరేషన్‌ కొరకు ఆమెను ఉస్మానియా లేదా, గాంధీ ఆసుపత్రికి పంపాలి కాని, ఇక్కడి ప్రయివేట్‌ ఆసుపత్రి వైద్యుడు యూరాలజిస్టు డాక్టర్‌ రాఘవేందర్‌ను సంప్రదించామన్నారు. ఆయన ముందుకు వచ్చి ఆపరేషన్‌ను చేశారని చెప్పారు. అలాగే నిర్మల్‌ జిల్లాకు చెందిన పోశానికి అదే విధమైన ఆపరేషన్‌ చేసినట్లు తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన ఆనంద్‌కు వెన్నుపూసలోని మూడు ఎముకలు విరిగి, మంచానికే పరిమితమయ్యాడు. డాక్టర్‌ నాగేశ్వర్‌ ఆధ్వర్యంలో వైద్య బృందం ఆనంద్‌కు ఆపరేషన్‌ చేయడంతో అతను ఇప్పుడు అందరిలాగే నడుస్తున్నాడని తెలిపారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌

యూరియా కష్టాలు



సిరికొండ: మండలంలో యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తగినంత యూరియా సరఫరా లేకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సొసైటీకి 900 బస్తాల యూరియా వచ్చింది. దీంతో సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు మంగళవారం ఉదయం నుంచే సొసైటీ వద్దకు తరలివచ్చారు. గంటల తరబడి బారులు తీరారు. ఏవో వెంకటేష్‌ టోకెన్లు ఇచ్చి యూరియాను పంపిణీ చేశారు.

‘పవర్‌’ లేని పంచాయతీ!

- బిచ్కుంద సర్పంచ్‌ చెక్‌ పవర్‌ రద్దు
- బిల్లులు రాక ఇబ్బందులు

బిచ్కుంద: బిచ్కుంద సర్పంచ్‌కు చెక్‌ పవర్‌ రద్దు కావడంతో పారిశుధ్య కార్మికుల వేతనాలు, చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్‌ శ్రీరేఖ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని పంచాయతీ అధికారులు చెక్‌ పవర్‌ రద్దు చేశారు. చెక్‌ పవర్‌ లేక నెల రోజులు అవుతుంది. ప్రజా అవసరాల నిమిత్తం చేసిన అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్మికుల వేతనాలకు చెక్కు రూపంలో జీపీ ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వాల్సి ఉంటుంది. చెక్‌ పవర్‌ లేకపోవడంతో ఎక్కడి బిల్లులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం జీపీలో పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌ కలిసి 25 మంది ఉన్నారు. వీరికి జీతాలు చెల్లించాలేని పరిస్థితి నెలకొని ఉంది. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి ఇతరులకు తాత్కాలికంగా చెక్‌ పవర్‌ కల్పించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బిచ్కుంద పంచాయతీ కార్యాలయం

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సాగర్‌ (ఫైల్‌)

సిరికొండ: మండలంలోని కుర్దుల్‌పేట్‌ గ్రామానికి వెళ్లే మార్గంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. న్యావనంది గ్రామానికి చెందిన కోనాయగారి సాగర్‌రెడ్డి(38) ఈ నెల 27న రాత్రి ఏడు గంటల సమయంలో సిరికొండ నుంచి న్యావనందికి బైక్‌పై బయలుదేరాడు. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనం సడన్‌గా మలపడంతో ఆ వాహనానికి తగిలి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు సాగర్‌ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బిచ్కుంద: బిచ్కుందలోని అన్నదమ్ముల చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చెరువులో మృతదేహం తేలిందని సమాచారం అందుకున్న ఎస్సై శ్రీధర్‌ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి 45 ఏళ్ల ఉంటాయని, ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని ఆయన చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

MISSING

■ BOMMA KANTI RAJESHWER, S/o. BOMMA KANTI PEDDA GANGA GOUD R/o.పచ్చల నడ్కుడ, ఇంటి నెం: 4-72, పచ్చల నడ్కుడ నుండి ఆర్మూర్‌కు బస్‌ ప్రయాణంలో A1090271 నెం॥ గల పాస్‌ పోర్టు పోయినది దొరికినచో సంప్ర: 9705031677.
[Z-1074443]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ కలిగినవారు Agentsగా కావలెను. ఫోన్‌: 9034974058
[H-792913]

WANTED

■ Wanted Teachers & Helping Teachers for all subjects to Teach Nursery to VII English Medium in NZB. Cont: 9966962549, 7673957578
[Z-772143]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 45/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
CONTACT: 9492010949

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586
[G-779863]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్‌ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్‌-3, డోస్ట్‌ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్‌/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646.
[B-1226251]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/-సంపాదించుకోండి.వాట్సాప్‌ చేయండి. 99596 17233, 84669 91319
[M-1190564]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్‌

పోలీసుల అదుపులో కిడ్నాప్‌ నిందితులు



కిడ్నాప్‌ వివరాలు తెలుపుతున్న సతీష్‌

సిరికొండ: యువకుడి కిడ్నాప్‌ కేసులో ప్రధాన నిందితుడు మల్లేష్‌తో పాటు మరో నిందితుడు శ్రావణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని గొల్ల గుర్జుకింది సతీష్‌ను సోమవారం కిడ్నాప్‌ చేసిన విషయం తెలిసిందే. నిందితుల కోసం ధర్పల్లి సీఐ సైదా, సిరికొండ ఎస్సై నర్సింలు తమ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నుంచి గాలింపులు చేపట్టారు. మంగళవారం జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద పోలీసులు నిందితులను పట్టుకొని, సిరికొండ పోలీస్‌ స్టేషన్‌కు తీసుకు వచ్చినట్లు సమాచారం. పోలీస్‌ స్టేషన్‌ వద్ద కిడ్నాప్‌కు గురైన యువకుడు సతీష్‌ విలేకరులతో మాట్లాడారు. కిడ్నాప్‌ చేసే సమయంలో సిరికొండ అడవుల్లో తనపై కర్రలతో దాడి చేశారని, భీంగల్‌లో వారి పొలం వద్ద దాడి చేశారని తెలిపాడు. అక్కడి నుంచి ధర్మపురి, కొండగట్టు తదితర ప్రాంతాల్లో కారులో తిప్పారని చెప్పాడు. కొండగట్టులో రాత్రి లాడ్జీలో ఉంచారని తెలిపాడు. మా అన్న విడాకుల పంచాయతీకి సంబంధించిన రూ.12 లక్షలను చెల్లిస్తే తనను వదిలేస్తామన్నారని పేర్కొన్నాడు. న్యావనందికి చెందిన ఇద్దరు, రావుట్లకు చెందిన ఇద్దరు తనను కిడ్నాప్‌ చేసే వ్యవహారంలో మల్లేష్‌కు సహకరించారని తెలిపాడు. వివరాల గురించి ధర్పల్లి సీఐ సైదాను సంప్రదించగా విచారణ కొనసాగుతున్నదని నిందితులను బుధవారం రిమాండ్‌ చేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీ

పెర్కిట్‌: ఆలూర్‌ మండలం దేగాం గ్రామంలో సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి రాగి తీగను దొంగిలించారు. దేగాం గ్రామం నుంచి మిర్దాపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో వాగు సమీపంలో గల వ్యవసాయ క్షేత్రాల పక్కన ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్లను దొంగలు ధ్వంసం చేసి రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరి రిమాండ్‌

ఎల్లారెడ్డి: మహిళను చంపుతామని బెదిరించిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌ చేసినట్లు ఎస్సై గణేష్‌ మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని ఆజామాబాద్‌ గ్రామానికి చెందిన చంద్రకళ భర్త పర్వాగౌడ్‌ను గ్రామానికి చెందిన కొందరు హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి రాజీ విషయంలో చంద్రకళ బావ రామాగౌడ్‌, అతడి కుమారుడు సతీష్‌గౌడ్‌ రాజీ అయ్యారు. కానీ చంద్రకళ రాజీకి ఒప్పుకోకపోవడంతో రామాగౌడ్‌, సతీష్‌గౌడ్‌ గత నెల27న ఆమెను గొడ్డలితో నరికి చంపుతామని బెదిరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్‌ గ్రామానికి చెందిన కోట్ల బాగన్న (48) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేష్‌ మంగళవారం తెలిపారు. వివరాలు.. సుమారు మూడు నెలల క్రితం బాగన్నతో అతడి భార్య గొడవ పెట్టుకుని ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన బాగన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సెప్టిక్‌ ట్యాంక్‌ శుభ్రం చేస్తుండగా..

- ఊపిరాడక అడ్డా కూలీ మృతి
- న్యాయం చేయాలని ఠాణా ఎదుట మృతుడి కుటుంబ సభ్యుల ధర్నా

ఖలీల్‌వాడి: సెప్టిక్‌ ట్యాంక్‌ శుభ్రం చేయడానికి వెళ్లిన అడ్డా కూలీ ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరగ్గా.. మొదట పోలీసులు ఫిట్స్‌తో చనిపోయినట్లు భావించారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాలు.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన హరిప్రసాద్‌(32) అడ్డా కూలీ. హబీబ్‌నగర్‌ కాలనీకి చెందిన హస్మత్‌ అలీ తన ఇంట్లో సెప్టిక్‌ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని సోమవారం తీసుకెళ్లాడు. అక్కడ పనిచేస్తూ హరిప్రసాద్‌ ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి ఓనర్‌ హస్మత్‌అలీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. హరిప్రసాద్‌ మృతికి కారణమైన ఇంటి యజమానిని అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు సీపీఐ నాయకులతో కలిసి పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ధర్నా చేశారు. కనీస ప్రమాణాలు పాటించకుండా సెప్టిక్‌ ట్యాంక్‌ శుభ్రం చేయించడంతోనే హరిప్రసాద్‌ చనిపోయాడని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల గోవర్ధన్‌, ద్యారంగుల కృష్ణ, బిజిగం సుజాత, మృతుడి తల్లి లక్ష్మి, సోదరుడు విక్రమ్‌ ఉన్నారు. కాగా ఈ కేసును తారుమారు చేయడానికి ఓ ప్రజాప్రతినిధి ప్రయత్నించినట్లు తెలిసింది.



హరిప్రసాద్‌ మృతదేహం



ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఆస్తి కోసం భర్త హత్య

- నిందితురాలిని అరెస్ట్‌ చేసిన పోలీసులు

బాన్సువాడ టౌన్‌: ఆస్తి కోసం కట్టుకున్న భర్తను రోకలి బండతో కొట్టి హత్య చేసిన భార్యను మంగళవారం బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో అరెస్ట్‌ చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. తాడ్కోల్‌ గ్రామానికి చెందిన తుమ్మల వెంకట్‌రెడ్డి (55) గత నెల 23న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల విచారణలో వెంకట్‌రెడ్డిని తన భార్య తుమ్మల రుక్మిణి హత్య చేసినట్లు తేలింది. వెంకట్‌రెడ్డి తాగుడుకు బానిసై నిత్యం ఆస్తి విషయంలో భార్యతో గొడవ పడేవాడు. తన ఆస్తిని ఆడపడుచులకు రాసి ఇస్తానని భార్యతో చెప్పేవాడు. ఈ క్రమంలో గత నెల 23న మద్యం తాగి ఇంటికి వచ్చిన వెంకట్‌రెడ్డి ఆస్తి విషయమై రుక్మిణితో గొడవ పడగా ఆమె రోకలి బండతో వెంకట్‌రెడ్డి మెడపై గట్టిగా కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం చున్నీతో రక్తం తుడిచేసిన నిందితురాలు ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని అందరిని నమ్మించింది. హత్యకు ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకుని, నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. ఈ సమావేశంలో ఎస్సై రవీందర్‌, క్రైం స్టాఫ్‌ ఓంకార్‌, కానిస్టేబుల్‌ గంగాధర్‌ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కుక్కల దాడిలో జీవాలు మృత్యువాత



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్‌ గ్రామంలో లింగాయపల్లి పర్శరాంలుకు చెందిన 12 జీవాలు మంగళవారం కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. మరో ఎనిమిది గాయపడ్డాయి. జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ప్రేమ్‌కుమార్‌ బాధితుడిని పరామర్శించారు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్‌

ఖలీల్‌వాడి: హత్య కేసులో ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్‌ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఆసద్‌ బాబానగర్‌లోని రాజీవ్‌గృహకల్ప బ్లాక్‌ నెంబర్‌ 21 ఎఫ్‌లో లెట్రిన్‌ పైప్‌ రిపేర్‌ విషయంలో అహ్మద్‌ఖాన్‌కు, చాంద్‌ పాషా, షేక్‌అత్తర్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో అత్తర్‌ కత్తిని పాషాకు అందివ్వగా చాంద్‌ పాషా కత్తితో అహ్మద్‌ ఖాన్‌కు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ అహ్మద్‌ఖాన్‌ మృతి చెందాడు. మంగళవారం నిందితులను ధర్మపురి హిల్స్‌ వద్ద పట్టుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు. సౌత్‌ రూరల్‌ సీఐ జగడం నరేశ్‌, ఆరో టౌన్‌ ఎస్సై సాయి కుమార్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌

స్తంభాన్ని ఢీకొన్న చెరుకు లారీ



రాజంపేట: రాజంపేటలో విద్యుత్‌ స్తంభాన్ని చెరుకు లారీ ఢీకొట్టింది. మండలంలోని కొండాపూర్‌ నుంచి వస్తున్న చెరుకు లారీ అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొంది. లారీ డ్రైవర్‌ మద్యం తాగి నడపడంతోనే ఈ ప్రమా దం జరిగిందని స్థానికులు తెలిపారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.